క్లుప్తంగా

రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న నర్సింహమూర్తి

సోంపేట: రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సన్నద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. బెంకిలి గ్రామంలో రైతులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తామన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులు వేయడం వలన చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించారు. సందేహాలుంటే వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వ్యవసాయ సహాయకులు జి.పవన్, రైతులు సింహాచలం పాడి, పిరియా చిరంజీవులు, పొందర రఘునాథం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నిర్వహణ ద్వారా యువతలో పరస్పరం స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని శావసానపుట్టుగలో శనివారం నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పోరాట స్ఫూర్తిని అలవర్చుకుని ఉత్తమ క్రీడా ప్రదర్శనతో అందరి మనస్సుల్ని గెలుచుకోవాలని క్రీడాకారుల్ని ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు శివాజీ యాదవ్, కరగాన వల్లభరావు, రామస్వామి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో పురపాలకసంఘానికి చెందిన స్థలాలను కొంతమంది ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు వాటిని తొలగించే ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టారు. బస్టాండ్ కూడలిలో షాపుల ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. మరోసారి ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

అధ్వానంగా అక్కుపల్లి శివ సాగర్ బీచ్



తీరంలో పేరుకుపోయిన చెత్త

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో చెత్త చెదారం పేరుకుపోవడంతో అధ్వానంగా మారింది. ప్లాస్టిక్ బాటిళ్లు, సంచులు, ఇతర వ్యర్థాలు తీరంలో దర్శనమిస్తున్నాయి. దీంతో తీరంలో సరదాగా కాసేపు గడుపుదాం అని వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే తీరానికి కొట్టుకువచ్చిన అలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు సైతం దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. తీరంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పర్యాటకులు అధికారులను కోరుతున్నారు.

27 నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

కంచిలి: మండలంలోని కె.శాసనాం గ్రామంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భగవతి చింతామణి తల్లి, కాళీమాతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గ్రామ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

మరింత నిఘా పెంచండి

- పెట్రోల్ బంకుల్లో లూజు అమ్మకాలొద్దు
- టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



టెక్కలి: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా లెక్కింపు ప్రక్రియ సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అల్లర్లు లేకుండా గ్రామాల్లో మరింత నిఘా పెంచాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెక్కింపు ప్రక్రియ అనంతరం ఎటువంటి తగాదాలు, అల్లర్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండే విధంగా ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే లెక్కింపు ప్రక్రియ పూర్తయినంతవరకు పెట్రోల్ బంకుల్లో లూజు అమ్మకాలు నిషేధించాలన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే ఆయా బంకు యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ బాలచంద్రారెడ్డి, తహసీల్దార్లు బాలమురళీకృష్ణ, పద్మావతి, సీఐలు పైడయ్య, చంద్రమౌళితో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడవద్దు

ఇచ్ఛాపురం: సార్వత్రికఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారెవరూ కూడా చట్టవ్యతిరేక పనులకు పాల్పడవద్దని పలాస-కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి సూచించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఇచ్ఛాపురం, సోంపేట సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోజున ఎటువంటి అనుమతులు లేకుండా ఊరేగింపులు చేపట్టరాదని, బాణసంచా కాల్చకూడదని సూచించారు. సమావేశంలో సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, మల్లేశ్వరరావు, ఎస్సైలు వి.సత్యన్నారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి



కాశీబుగ్గ: పోలీసు అధికారులతో మాట్లాడుతున్న భరత్ నాయక్

శాంతిభద్రతలపై ప్రత్యేకదృష్టి

కాశీబుగ్గ: ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తుండటంతో పలాస నియోజకవర్గంలో శాంతిభద్రతల విషయంలో ఎటువంటి లోటు రాకుండా చూడాలని పలాస రెవెన్యూ డివిజన్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ అన్నారు. పలాస ఎన్నికల మానిటరింగ్ కార్యాలయంలో శాంతిభద్రతలపై పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఇప్పటికే శాంతిభద్రతలకు విఘాతం లేకుండా సహకరించాలని కోరామన్నారు.ఓట్ల లెక్కింపునకు ముందు, అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వివాదాస్పద వ్యక్తుల కదలికలను గమనించాలని సూచించారు. సమావేశంలో మూడు మండలాల సీఐలు, ఎస్సైలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా అసిరిపోలమ్మ సంబరం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



కళాకారుడి విన్యాసం

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మోరు సంబరాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమ్మవారిని గ్రామవీధుల్లో టపాకాయలు కాలుస్తూ ఊరేగించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వీధినాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

అమరవీరులకు విప్లవ నివాళి

పలాస:

శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటానికి ఉత్తేజాన్ని ఉత్సాహాన్నిచ్చిన నక్సలబరీ పోరాటానికి అభిమానులు విప్లవ జేజేలు పలికారు. పలాస మండలం తర్లాకోట పంచాయతీలోని కొత్తారింగ్ తాళబద్ర గిరిజన గ్రామంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అమర వీరులకు సంతాప సభను శనివారం నిర్వహించారు. శ్రీకాకుళ పోరాటంలో అమరులైన వారికి పేరు పేరున జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ.. అమరవీరుల మార్గమే మన మార్గమన్నారు. దోపిడీ పీడన పోవాలంటే ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు సవర బంగ్లా , పాపారావు, సవర సోమేశ్వరరావు, ఆనంద్, గోవింద్, దేవేంద్ర, భువన్‌కుమార్, జుత్తు వీరాస్వామి, విశాల్ ఉన్నారు.



అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

సర్కారు బడిలో పిల్లలను చేర్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కొళగాం ఇన్‌చార్జి హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

ఇచ్ఛాపురం రూరల్: కార్పొరేట్ స్థాయిలో అన్ని మౌలిక వసతులతో ఉండే సర్కారు బడుల్లో తమ పిల్లల్ని చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ప్రైవేటు పాఠశాలలకు చెందిన యాజమాన్యం నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తక్కువ ఫీజుతో తమ పాఠశాలల్లో పిల్లల్ని చేర్చుకుంటామంటూ మాయమాటలు చెబుతుండటంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు జాగ్రత్త పడుతున్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గిపోతే, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించే అవకాశం ఉండటంతో పిల్లలు ప్రైవేటు వైపు వెళ్లకుండా తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను, పదో తరగతి ఫలితాలను వివరిస్తున్నారు. ఉచితంగా జగనన్న విద్యా కానుకలు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందిస్తున్నారని, నాడు-నేడు ద్వారా బడుల్లో మరుగుదొడ్లు, తాగునీరు, బెంచీలు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాట్లపై తెలియజేస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

సోంపేట: గత ఖరీఫ్ సీజన్‌లో వంటిపంటను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పైడిగాం రైతాంగ కమిటీ, బీసీ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట, కంచిలి మండలాల పరిధిలోని జలంత్రకోట, గోకర్ణపురం, బూరగాం, సోంపేట, జింకిభద్ర, బెంకిలి తదితర గ్రామాల్లో వివిధ కారణాలతో వరిపంట పాడైందని తెలిపారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు కూడా విన్నవించి ఉన్నామన్నారు. నష్టపరిహారం అందించడంతో పాటు, పైడిగాం ప్రాజెక్టు కాలువ మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినప్పటికీ ఇంతవరకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైన సమస్యను పరిష్కరించాలని బీసీ సంఘ నేతలు బీన ఢిల్లీరావు, పి.మల్లేశ్వరరావు, పి.సోమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

మాజీ సైనికుల ఔదార్యం



టేబుల్ ఫ్యాన్లను అందజేస్తున్న మాజీ సైనికులు

కాశీబుగ్గ: మాజీ సైనికులు ఔదార్యాన్ని చాటుకున్నారు. బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన మాజీ సైనికులంతా గ్రామంలో అనాథలుగా ఉంటున్న వృద్ధులను గుర్తించారు. వేసవి నేపథ్యంలో ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం టేబుల్ ఫ్యాన్లను శనివారం అందించి ఆదర్శంగా నిలిచారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు



మాట్లాడుతున్న అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్టు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. పలాసలోని తన స్వగృహంలో శనివారం ఆయన మాట్లాడారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పార్టీ నాయకులు, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పలాసలోని పార్టీ కార్యాలయం వద్ద ఆ రోజు ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతోందన్నారు.

ఇంటర్ పరీక్షలకు 369 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శనివారం 10,385 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 369 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో భాగంగా శనివారం ఇంగ్లిష్ పేపర్‌కు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం ఫస్టియర్ విద్యార్థులు 9,402 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 9,083 మంది పరీక్ష రాశారు. 319 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెకెండియర్ విద్యార్థులు 983 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 933 మంది హాజరయ్యారు. 50 మంది డుమ్మాకొట్టారు. డీవీఈవో కోట ప్రకాశరావు, ఆర్ఐవో ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్, గూణ సింహాచలం, కీర్తి తవిటినాయుడు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు



జూనియర్ విభాగంలో క్యారమ్స్ పోటీల్లో చిన్నారులు

నందిగాం:

స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు శనివారం నిర్వహించారు. వేసవి శిబిరంలో భాగంగా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో క్యారమ్స్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ తెలిపారు. పోటీల్లో విజేతలకు వేసవి శిబిరాల ముగింపురోజున బహుమతులు అందజేస్తామని చెప్పారు. పిల్లలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీతి కథల్లో జ్ఞానాన్ని తెలుసుకోవాలి

టెక్కలి: నీతి కథల్లో దాగి ఉన్న జ్ఞానాన్ని తెలుసుకోవాలని టెక్కలి శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థిని, విద్యార్థులకు నీతి కథలను బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచతంత్ర, నీతికథలు, అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, మర్యాద రామన్న తదితర కథలను ప్రతీ విద్యార్థి చదవాలని కోరారు.



టెక్కలి: విద్యార్థులతో నీతి కథలను చదివిస్తున్న రూపావతి

పెద్దమురహరిపురంలో కార్డన్ సెర్చ్



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురం గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ సీహెచ్ రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాల పోలీసులంతా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. సార్వత్రి ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామంలో ఇతర ప్రాంతాలకు చెందిన అనుమానిత వ్యక్తులు ఉండకూడదని హెచ్చరికలు జారీ చేశారు. మందుగుండు సామాగ్రి నిల్వలు ఉంచరాదని, లూజు పెట్రోల్ అమ్మకాలు నిషేధంతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉందని హెచ్చరించారు. మద్యం, సారా, గంజాయి నిల్వలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వచ్చే నెల 26వ తేదీ వరకు ఊరేగింపులు, ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. తగాదాలు, కొట్లాటలతో శాంతి భద్రతలకు విఘాతలం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కంచిలిలో కోతుల బెడద



మఠం కంచిలిలో కోతుల హల్‌చల్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కోతుల బెడద ఎక్కువైంది. రెండేళ్లగా ఈ ప్రాంతంలో కోతుల సంచారం ఎక్కువైంది. ముఖ్యంగా మఠం కంచిలి పరిసర ప్రాంతంలో జగన్నాథ స్వామి మఠం వద్ద తోటలో స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి. అక్కడ నుంచి గ్రామంలో తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. బయట ఏ వస్తువు పెట్టినా పట్టుకుపోతున్నాయి. దుకాణాల్లో వేలాడదీసిన సామాన్లను అమాంతం లాక్కెల్లిపోతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు హడలెత్తిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పలాసకు చేరుకున్న పుస్తకాలు



పుస్తకాల పరిశీలనలో అధికారులు



లారీ నుంచి పుస్తకాలను దించుతున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రభుత్వం సరఫరా చేస్తున్న నోట్ పుస్తకాలు శనివారం మండలానికి చేరాయి. పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న 3,975 మంది విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9, 10 తరగతులకు అందించడానికి 46,746 నోట్‌బుక్‌లు వచ్చాయి. వీటిని స్థానిక పీపీసీఎస్ గోదాంలో భద్రపరిచారు. మండల విద్యాశాఖాధికారి చెరుకుపల్లి సత్యం, సీఆర్పీలు పోతనపల్లి బాలరాజు, ఉర్నాన అప్పలరాజు పరిశీలించారు.

గార పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ




రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

గార: గార పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అన్ని గ్రామాలను సీఐ, ఎస్సైలు సందర్శించాలని, ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంతో పాటు ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఉన్నారు.

29న గణిత అష్టావధానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈనెల 29న గణిత అష్టావధానం జరుగుతుందని నిర్వాహకులు గుమ్మా నగేష్, కామేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థలలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్న విశ్రాంత గణిత ఉపాధ్యాయులు నిష్టల నర్సింహమూర్తిచే బాపూజీ కళామందిరంలో ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు అష్టావధానం ఉంటుందన్నారు. ఇందులో వర్గములు, ఘనములు, గుణకారములు, మాయా చదరం, కేలండర్ తదితర అంశాలపై అవధానం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు క్యాలిక్యులేటర్లతో హాజరు కావాలని కోరారు.

●ఆకట్టుకున్న హరివిల్లు



ఆకాశంలో అద్భుతం చోటుచేసుకుంది. రంగురంగుల హరివిల్లు చూపరులను ఆకట్టుకుంది. పలాస జాతీయ రహదారి సమీపంలో పచ్చని చెట్ల పైనుంచి శనివారం మధ్యాహ్న సమయంలో ఏర్పడిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. దీన్ని చాలామంది సెల్‌ఫోన్లతో బంధించారు.

-కాశీబుగ్గ